www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 4 జూన్ 2025 | 5 | తూర్పుగోదావరి

జూన్‌లోనూ అబ్బురమే...

మే పుష్పాలు సాధారణంగా ప్రతి ఏడాది మే నెలలో వికసిస్తాయి. కాని తాళ్లపూడిలోని గోనేరువు శ్రీనివాస్ బ్రదర్స్ ఇంటి ఆవరణలో ఉన్న మే పుష్పం ఈ ఏడాది జూన్‌లో వికసించి అందర్నీ ఆశ్చర్యపరిచింది.

:: ప్రజాశక్తి - తాళ్లపూడి ::

రైతులకు అసైన్డ్ కష్టాలు

- ఏడాదిగా నిలిచిన డి-పట్టా రిజిస్ట్రేషన్లు
- ఫ్రీ హోల్డ్ భూములు పరిశీలన పేరుతో సాగదీత
- జిల్లాలో అసైన్డ్ భూమి 2477.61 ఎకరాలు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి ప్రభుత్వ పాలనలో రైతన్నలు కష్టకాలం ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారుల గణాంకాల ప్రకారం 2477.61 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ లో 1220.77 ఎకరాలు, కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 1256.84 ఎకరాలు ఉంది. ఈ భూముల్లో రైతులు సాగు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోతున్నా పరిహారం ఇవ్వడంలేదు. బీమా లేదూ.. పరిహారమూ ఇవ్వడంలేదు. రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నా పెట్టుబడి సాయం రూ.20వేలు అందించటం లేదు. ఈ క్రమంలోనే డీ పట్టా పొందిన అసైన్డ్ భూములకు అర్హత ఉన్నప్పటికీ ఏడాదిగా రిజిస్ట్రేషన్ కాకపోవడంతో బాధితులు లబోదిబో మంటున్నారు. ఈ భూములకు సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరపకుండా కూటమి ప్రభుత్వం ఫ్రీజింగ్‌లో పెట్టడంతో సమస్య తలెత్తింది. ఫ్రీహోల్డ్ భూములు పరిశీలన పేరుతో చంద్రబాబు సర్కారు అనుసరిస్తున్న సాగదీత వైఖరి రైతులకు శాపంగా మారింది. ఆర్థిక అవసరాలకూ భూములు అమ్ముకోలేక చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యను బహిరంగంగా చెప్పుకునేందుకు రైతులు సాహసించలేని పరిస్థితి నెలకొంది. తమ ఆవేదనను బయటకు చెబితే ఎటువైపు నుంచి కొత్త సమస్య వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 1954 జూన్ 18 కంటే ముందు అసైన్ అయిన భూములు నిరభ్యంతర పత్రం ఉంటుంది. ఇలాంటి భూములు జిల్లాలో 50 వేల ఎకరాల వరకూ ఉండొచ్చని అంచనా. కూటమి ప్రభుత్వం మొత్తం అసైన్డ్ భూములకు సంబంధించి క్రయ విక్రయాలు ఇతర లావాదేవీలు నిర్వహించకుండా ఏడాదిగా ఫ్రీజింగ్‌లో పెట్టింది. దీంతో నిరభ్యంతరం పత్రం (ఎన్ఓసీ) పొందిన అసైన్డ్ భూములు కూడా రిజిస్ట్రేషన్ కావటం లేదు. ప్రభుత్వ భూములను 20 ఏళ్ల క్రితం అసైన్‌మెంట్ గా పొందిన వారికి ఫ్రీ హోల్డ్ ద్వారా యాజమాన్య హక్కు కల్పించేందుకు గత ప్రభుత్వం చర్యలు పెట్టింది. అటు తర్వాత కూటమి ప్రభుత్వం రావటంతో ఫ్రీ హెూల్డ్ భూముల పరిశీలనకు తెరతీసింది. అయితే ఏడాది అవుతున్నాఈ ప్రక్రియ పూర్తి చేయలేదు. ఎప్పటికప్పుడు గడవును పొడిగిస్తూ సాగదీస్తూనే ఉంది. పరిశీలన పూర్తయ్యే వరకూ ఫ్రీజింగ్‌కొనసాగించే అవకాశం ఉండటంతో రైతులకు ఇబ్బందులు తప్పటంలేదు.

రాజమండ్రి డివిజన్

మండలం పేరు	అసైన్డ్ భూమి ఎకరాల్లో..
రాజమండ్రి రూరల్	13.74
గోకవరం	400.11
బిక్కవోలు	45.10
కడియం	10.82
రాజానగరం	221.20
అనపర్తి	4.51
రంగంపేట	260.59
సీతానగరం	71.19
కోరుకొండ	193.50
మొత్తం	1220.77

కొవ్వూరు డివిజన్

మండలం పేరు	అసైన్డ్ భూమి ఎకరాల్లో..
పెరవలి	0.99
దేవరపల్లి	111.31
ఉండ్రాజవరం	5.49
నల్లజర్ల	516.92
చాగల్లు	43.96
కొవ్వూరు	169.43
తాళ్లపూడి	68.85
గోపాలపురం	317.96
నిడదవోలు	21.94
మొత్తం	1220.77

సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్ర కిషన్

నీరు, స్వచ్ఛత మిషన్ అమలుపై సంతృప్తి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జల్ జీవన్ మిషన్‌లో భాగమైన నీరు, స్వచ్ఛత (వాటర్ అండ్ శానిటేషన్) మిషన్ నిర్వహణ తీరు జిల్లాలో మెరుగ్గా ఉందని కేంద్ర బృందం ప్రశంసించింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి, నీరు, స్వచ్ఛత మిషన్ నోడల్ అధికారి పూర్ణ చంద్ర కిషన్ అధ్యక్షతన జిల్లా నీరు, స్వచ్ఛత మిషన్ సమావేశం కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర సంయుక్త కార్యదర్శి పూర్ణచంద్ర కిషన్ మాట్లాడారు. జిల్లాలో నీరు, స్వచ్ఛత మిషన్ రూపకల్పన, అమలు చేస్తున్న తీరు బాగుందన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అధిక లవణీయత, నీటి ఎద్దడి గల అల్లవరం, ఉప్పలగుప్తం మండలాలలో పర్యటించి మిషన్ అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలించామన్నారు. అదే విషయంలో తూర్పు గోదావరి జిల్లాలో అమలు చేస్తున్న తీరు పై జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రణాళిక అమలు సమీక్ష చేశారు. అటువంటి మిషన్ అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిషన్ ద్వారా మంచినీరు అందించే విషయంలో జిల్లా యంత్రాంగం సమర్థ వంతంగా పనిచేస్తోందన్నారు. అయితే నిర్వహణ ఖర్చుల విషయంలో దృష్టి సారించాలని సూచించారు. 15 వ ఆర్థిక సంఘం నిధులలో అధిక భాగం నిర్వాహణకే ఖర్చవడానికి గల కారణాలను విశ్లేషించాలని చెప్పారు. ఈ సమావేశాలను ప్రతినెల తప్పక నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నీటి ఎద్దడి గల గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు తమ సమస్యలు తెలిపేందుకు పిజిఆర్ఎస్‌తో పాటు 1100 టోల్ ఫ్రీ నెంబర్ల వ్యవస్థ ఉన్నట్లు తెలిపారు. కేంద్ర బృందంలో జాతీయ వాష్ నిపుణులు (నేషనల్ వాష్ ఎక్స్పర్ట్స్) అయిన బిశ్వదీప్ దాస్ సాంకేతిక అంశాల్లో కొన్ని మార్పులను సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి జివి.గిరి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు నిర్వీర్యం తగదు

ప్రజాశక్తి-నల్లజర్ల

భవన నిర్మాణ కార్మికులు అలుపెరగని పోరాటాల ద్వారా సాధించుకున్న సంక్షేమ బోర్డును పాలక వర్గాలు నిర్వీర్యం చేయడం తగదని సిఐటియు జిల్లా నాయకులు కొక్కిరిపాటి వెంకట్రావు అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు సుదీర్ఘమైన పోరాటాలు చేయడంతో 2005లో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. నిర్మాణ రంగంలో ప్రమాదపు అంచున కార్మికులు పనిచేస్తున్నారన్నారు. నిత్యం అనేక మంది ప్రమాదాలకు గురవతున్నారన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న యజమాని ప్రమాదానికి గురవ్వడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడిన దాఖలాలు అనేకం ఉన్నాయన్నారు. ఇలాంటి కష్టకాలంలో ఆయా కుటుంబాలను ఆదుకోవడానికి సంక్షేమ బోర్డు ఉపయోగపడేదన్నారు. ఈ పథకం అమలు వల్ల ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం లేదన్నారు. అయినా కావాలనే నిర్వీర్యం చేశారన్నారు. బోర్డులో నిధులున్నా క్లెయిములను పరిష్కరించట్లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బోర్డును పున:ప్రారంభిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఏడాది గడుస్తున్నా ఆ హామీ ఊసే ఎత్తడం లేదన్నారు. ఇప్పటికైనా హామీని అమలు చేయాలని కోరుతున్నారు.

వృద్ధులు, వికలాంగులకు రేషన్ డోర్ డెలివరీ

ప్రజాశక్తి - రాజానగరం

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులను సరఫరా చేస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 65,863 మంది వృద్ధులు, వికలాంగులను గుర్తించామన్నారు. మండలంలో లాలాచెరువు, దివాన్ చెరువులో వృద్ధులు, వికలాంగుల ఇళ్లకు రేషన్ సరుకుల పంపిణీని మంగళవారం ఆమె పరిశీలించారు. స్వయంగా సరుకులు అందించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ఆదేశాలు మేరకు సచివాలయ సిబ్బంది వీటిని అందిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 871 చౌక ధరల దుకాణాల డీలర్లు ఉన్నారన్నారు. వారి పరిధిలో 5,64,994 మంది రేషన్ కార్డు దారులు ఉన్నారన్నారు. 65 ఏళ్ల పూర్తిన వారు 65,863 మంది ఉన్నారన్నారు.

కడియం : వృద్ధులు, వికలాంగులకు ఇళ్ల వద్ద రేషన్ పంపిణీ తీరును స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజా రమేష్ ప్రేమ్ కుమార్ స్వయంగా పరిశీలించారు. కడియం మండలం వేమగిరి గ్రామంలోని రేషన్ షాప్ నెంబర్ 18, 19, 33 షాపులను మంగళవారం పరిశీలించారు. స్థానిక వృద్ధులు, వికలాంగులతో మాట్లాడారు. ఆయన వెంట రేషన్ షాప్ డీలర్ల మండల అధ్యక్షులు జి.పృథ్వీరాజ్, రేషన్ షాప్ డీలర్లు ఉన్నారు.



అంధకారంలో రైల్వే వంతెన

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిడదవోలు - సమిశ్ర గూడెం రైల్వే వంతెన అంధకారంలో కొట్టు మిట్టాడుతోంది. విద్యుత్ దీపాలు లేకపోవడంతో చీకట్లలోనే వంతెన పైనుంచి ప్రజలు ప్రయాణించాల్సిన పరిస్థితి. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలోనే ఈ వంతెనపై 32 విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ కరువవ్వడంతో ప్రస్తుతం వీటిలో నిడదవోలు వైపున ఉన్న నాలుగు దీపాలు మాత్రమే వెలుగుతున్నాయి. దీంతో వంతెన చీకట్లలోనే మగ్గుతుంది. రాత్రి వేళల్లో ఈ వంతెనపై నుంచి ప్రయాణించాలంటేనే ప్రజలు బెంబేలెత్తే పరిస్థితి నెలకొంది. వంతెనపై నడక దారి కూడా చాలాచోట్ల దెబ్బ తింది. దీంతో చీకట్లో గుంతలు కనిపించక వాటిలో పడి గాయాల పాలవుతున్న సందర్భాలు అనేకం. మహిళలు చీకట్లో నడచి రావడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ పలువురు ఉద్యోగులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు నిత్యం ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, పాలకొల్లు, నరసాపురం వంటి పట్టణాలకు రాకపోకలు సాగించాలనే ఈ వంతెనే దిక్కు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డ్వాక్రా మహిళల ఖాతాల్లో రూ.లక్షల్లో జమ

- వారికి తెలీకుండానే విత్‌డ్రా
- వడ్డీలు కట్టాలంటూ బ్యాంకర్ల ఒత్తిళ్లు
- లబోదిబోమంటున్న మహిళలు

ప్రజాశక్తి-నల్లజర్ల

వారి బ్యాంకు ఖాతాల్లో లక్షలాది రూపాయాలు ఉన్నట్టు వారికి తెలియదు, అవి డ్రా చేసినట్టు కూడా తెలియదు. కాని ఆ డబ్బులకు వడ్డీలు కట్టాలంటూ బ్యాంకు అధికారులు ఒత్తిళ్లు తెస్తున్నారు. దీంతో ఆశ్చర్యపోవడం వారి వంతైంది. తమకు తెలియని లావాదేవీలకు లక్షలు లక్షలు వడ్డీలు ఎలా కట్టమంటారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు . నల్లజర్ల మండలం ప్రకాష్ రావు పాలెం గ్రామానికి చెందిన, ఝాన్సీ లక్ష్మీబాయి, శ్రీ రాజీవ్. అంబిక తదితర గ్రూపు సభ్యులు. ఫిబ్రవరి నెలలో వీరి గ్రూపులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకూ నల్లజర్ల ఎస్‌బిఐ బ్యాంకు వారు డబ్బును జమ చేశారు. కనీసం ఈ సమాచారం కూడా వారికి తెలియదు. తరువాత ఆ డబ్బును ఎవరో డ్రా చేశారు. ఇది కూడా వారికి తెలియదు. ఇప్పుడు ఇప్పుడు ఒక్కొక్క గ్రూప్ సభ్యులు రూ.50 వేల నుంచి రూ.లక్ష రూపాయల వరకు వడ్డీ కట్టాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. దీంతో వారు బ్యాంకు వద్ద ఆందోళనకు దిగారు. తమకు తెలియకుండా, ఎపిఎం ఉత్తర్వులు లేకుండా ఇంత డబ్బును ఎలా వేశారని? ఎలా తీశారని? వారు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ఎస్‌బిఐ బ్యాంకులో డబ్బులు జమ చేసినప్పుడు గానీ, నగదు డ్రా చేసినప్పుడు గాని కనీసం పోస్టింగ్ కూడా వేయరని,అక్కడ ఉన్న మిషన్లు పనిచేయవు వారు చెబుతున్నారు. ఇంత దారుణమైన బ్యాంకు మరొకటి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానం, వార్షిక రుణ జీవనోపాధి ప్రణాళికలో భాగంగా సర్వే చేసిన సమయంలో ఈ మోసం బయట పడిందని తెలిపారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తూ ఎపిఎంకు వినతిపత్రం అందించారు.

వినతిపత్రం అందిస్తున్న మహిళలు

ఈ ఘటనపై ఎపిఎం శ్యామ్ సుందర్‌ను వివరణ కోరగా... వార్షిక రుణ జీవనోపాధి ప్రణాళిక 2025 26. సర్వేను ఇటీవల నిర్వహించారన్నారు. ఈ సమయంలో తేడాలు బయటపడినట్లు గ్రూపు సభ్యుల ద్వారా మంగళవారం తనకు తెలిసిందన్నారు. దీనిపై బ్యాంకు అధికారులతో మాట్లాడతానని ఆయన తెలిపారు. బ్యాంకు మేనేజర్ వివరణ కోరెందుకు బ్యాంకు వెళ్ళగా అందుబాటులో లేరు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తతతో వ్యవహరించాలని విజయవాడ డాన్ బాస్కో నవజీవన బాల భవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల క్లస్టర్ కో-ఆర్డినేటర్ శ్రీతేజ అన్నారు. మంగళవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో ఉండ్రాజవరం పిహెచ్‌సిలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశ వర్కర్లకు సైబర్ నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు గ్రామాలతో పాటూ, మండలంలోని ఉండ్రాజవరం, దమ్మెన్ను, వడ్లూరు గ్రామాలను దత్తత గ్రామాలుగా స్వీకరించామన్నారు. స్థానిక ప్రభుత్వ అధికారులతో కలుపుకొని, తమ సంస్థ తరఫున అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సురక్షితమైన డిజిటల్ పౌరులుగా ఉండేందుకు, సైబర్ నేరాలపై వివిధ రకాల ప్రజలకు అవగాహన నిర్వహిస్తున్నామన్నారు. సైబర్ కేటుగాళ్లు లక్కీడ్రా, ఉచిత రీఛార్జ్, గిఫ్ట్ కూపన్లు పేర్లతో ఆశ చూపి బ్యాంకు ఖాతాలో డబ్బును కొల్ల గొడుతున్నారన్నారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు వెంటనే స్పందించి, నేరం జరిగిన గంటలోపే 1930 నెంబర్‌కు కాల్ చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ సుబ్రహ్మణ్యం, పిహెచ్ఎన్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీతేజ

జెఇఇలో చాగల్లు విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి- చాగల్లు

జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో చాగల్లుకు చెందిన విద్యార్థిని కొడమంచిలి హసికారష్మీ ప్రతిభ కనబర్చింది. ఆలిండియా ఎస్‌సి కేటగిరీలో 3,930 ర్యాంక్ సాధించింది. దేశంలోని ప్రఖ్యాత గాంచిన ఐఐటి విద్యాసంస్థల్లో సీటు పొందేందుకు అర్హత సాధించింది. తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఈ ర్యాంకును సాధించానని హసికా రష్మీ తెలిపింది. ఆమె తండ్రి కొడమంచిలి సత్యనారాయణ వయోజన విద్యాశాఖలో సహాయ ప్రాజెక్ట్ అధికారిగా పనిచేస్తున్నారు. తల్లి పద్మ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా హసికా రష్మీని పలువురు నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా కరుటూరి పుట్టిన రోజు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని చాగల్లులో టిడిపి పార్టీ సీనియర్ నాయకుడు కరుటూరి సతీష్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. పార్టీ కార్యాలయంలో అభిమానులు, నాయకులు, కార్యకర్తల మధ్య ఈ వేడుక జరిగింది. కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎంసి చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి(నాని), టిడిపి, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఆయనకు పూల బొకేలు అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి సతీష్ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. పుట్టినరోజును కార్యకర్తల మధ్య జరుపుకోవడం హర్షణీయమన్నారు. ఇలాగే మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

సతీష్‌కు కేకు తినిపిస్తున్న ఎంఎల్‌ఎ ముప్పిడి

క్షయపై వైద్య సిబ్బందికి అవగాహన

ఉండ్రాజవరం : ఉండ్రాజవరం పిహెచ్‌సిలో ఆశాలు, ఎఎన్ఎంలు, ఇతర సిబ్బందికి టిబి ఇంటెన్సిఫైడ్‌పై శిక్షణను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్.ఉషాదేవి మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట జ్వరం, బరువు తక్కువగా ఉన్న వారిని గుర్తించి, వారికి టిబి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. టిబి సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఆశాజ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో టిబి వ్యాధి నివారణ మందులు వాడుతున్న వారిని గుర్తించి, వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

కార్టూ'నిజం'



నాణ్యమైన విద్యకు చిరునామా శ్రీ సీతారామ

ప్రజాశక్తి- గోకవరం

నాణ్యమైన విద్యను అందించే పాఠశాలలకు చిరునామాగా నిలుస్తోంది శ్రీ సీతారామ ఇంగ్లిష్ మీడియం స్కూల్ అని కరస్పాండెంట్, ప్రిన్సిపల్ సి.విజయ రాజురత్నం అన్నారు. పాఠశాల ప్రగతిపై ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు. మండల కేంద్రమైన గోకవరం అచ్చుయపేట రామాలయం వీధిలో 1988 జూలై 17న 50 మంది విద్యార్థులతో శ్రీసీతారామ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను ప్రారంభించామని తెలిపారు. 2025 నాటికి 250 మందికి పైగా విద్యార్థులతో పాఠశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనుభవజ్ఞులైన అర్హత కలిగిన 14 మంది ఉపాధ్యాయులతో విద్యార్థులకు బోధనను అందిస్తున్నామన్నారు. నర్సరీ నుంచి ఏడో తరగతి వరకు విద్యను అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఎంతమంది చదువుకున్నది కాదు- ఆ చదువు మనకు ఎంత సంస్కారం నేర్పించింది అనేదే ముఖ్యమన్నారు. అదే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేలా విద్యా బోధన ఉంటుందన్నారు. విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బడుగు, బలహీన వర్గాల పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను కేటాయించి ఉచితంగా విద్యాబోధన అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు నవోదయ, ఎపిఆర్‌జెసి వంటి ప్రవేశ పరీక్షలకు కోచింగ్ కూడా తమ పాఠశాలలో అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది నవోదయకు ఒక విద్యార్థి, ఎపిఆర్‌జెసికి ఇద్దరు ఎంపికయ్యారని తెలిపారు. అబాకస్, స్పీడ్ మ్యాథమెటిక్స్‌లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. భారత రాజ్యాంగంపై ఇటీవల నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబర్చి అవార్డు సాధించారన్నారు. అలాగే బెస్ట్ స్టూడెంట్ అవార్డు కూడా తమ పాఠశాలకు దక్కిందన్నారు. ప్లే ఆర్డినెన్స్, ప్లే గ్రౌండ్, డిజిటల్ క్లాసులు, చక్కని కమ్యూనికేట్, ఇంగ్లీష్ స్పెషల్ క్లాసులతో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. విద్యతో పాటూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, కరాటే, విజువల్ క్లాసులు, కంప్యూటర్ శిక్షణలో తర్ఫీదు ఇస్తున్నామన్నారు. డ్రాపౌట్ విద్యార్థులను ప్రోత్సహిస్తూ చదివిస్తున్న ఏకైక విద్య సంస్థ శ్రీ సీతారామ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మాత్రమేనని తెలిపారు. నెలకి ఒకరోజు ఫ్రూట్స్ డే నిర్వహించి, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఫిల్టర్ వాటర్‌ను అందిస్తున్నామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విశాలమైన తరగతి గదుల్లో బోధనను అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఏడాది నుంచి పాఠశాలను 8వ తరగతి వరకూ అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు.

అధ్యాపక బృందం

భోగి నిర్వహణ

పాఠశాల భవనం

:: స్కూల్ ప్రత్యేకతలు ::

- మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ క్లాసుల నిర్వహణ
- అతితక్కువ ఫీజుతో నడుస్తున్న ఏకైక విద్యాసంస్థ
- అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన
- వేసవిలో అన్ని సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ
- విశాలమైన ఆటస్థలం
- ప్రతి 25 మందికి ఒక ఉపాధ్యాయుడు, ఒక గైడ్ టీచర్
- ప్రతి విద్యార్థితోనూ ఇంగ్లీషులో మాట్లాడించడం
- యోగా, ధ్యానం క్లాసుల నిర్వహణ
- క్రీడల్లో మెరుగైన శిక్షణ
- ఒత్తిడి లేని విద్యా బోధన
- ఉచితంగా కంప్యూటర్ శిక్షణ
- నవోదయ ప్రవేశ పరీక్షలకు కోచింగ్
- 3 నుంచి 5వ తరగతి వరకూ ఐఐటి మ్యాథ్స్‌లో శిక్షణ
- 6 నుంచి 8వ తరగతి వరకూ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో శిక్షణ

నేరాలు ఘోరాలు

ప్రమాదానికి గురైన లారీ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు మృతి

ప్రజాశక్తి- కొవ్వూరు

కాపవరం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు దుర్మరణం పాలయ్యారు. మంగళవారం తెల్లవారు జామున హైదరాబాద్ నుంచి మండపేటకు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఇతర లారీలు తన లారీని ఢీకొడతారని భావించిన లారీ డ్రైవర్ బత్తుల శీనయ్య అప్రమత్తపై లారీ వెనుక నిలబడి అమార్గంలో వస్తున్న వాహనాలకు డైరెక్షన్ ఇస్తున్నారు. అదే సమయంలో జంగారెడ్డిగూడెం నుంచి ధాన్యంలోడుతో వస్తున్న మరో ఐసర్ వ్యాను శీనయ్యను ఢీ కొట్టి ఆగి ఉన్న లారీలు ఢీ కొట్టింది. ఈ ఘటనలో శీనయ్యతో పాటూ కాకినాడ జిల్లా కత్తిపూడికి చెందిన ఐసర్ వ్యాన్ డ్రైవర్ కొయ్య బాబూరావు(40) మృతి చెందారు. కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శీనయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని నవఖండ్రవాడ గ్రామంలో నకులమ్మ గుడి వీధిలోని ఒక ఇంట్లో దాచివుంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని చక్రవర్తుల నాగమణి ఇంట్లో రేషన్ బియ్యం దాచి వుంచినట్లు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌ఛార్జ్ ఎంఎస్ఒ భారతి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది దాడి చేశారు. ఒక గదిలో మూడు సంచుల్లో సుమారు వంద కిలోల బియ్యాన్ని అధికారులు గుర్తించారు. వాటిని సీజ్ చేసి సమీప రేషన్ దుకాణానికి తరలించారు. బియ్యంను దాచిపెట్టిన నాగమణిపై క్రిమినల్ కేసుతోపాటు, 6ఎ కేసు నమోదు చేసినట్లు ఎంఎస్ఒ తెలిపారు. ఇదిలావుండగా అధికారులు వచ్చేలోగా ఒక ఆటోలో రేషన్ బియ్యం తరలి పోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ దాడుల్లో విఆర్ఒ పి.రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కోటనందూరు

తుని - నర్సీపట్నం ప్రధాన రహదారిలోని ఉప్పరగూడెం వద్ద ట్రాక్టర్, బైకు ఢీకొన్న సంఘటనలో గేదెల రాజునాయుడు (37) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... తుని మండలం కుమర్లలోవ గ్రామానికి బైక్‌పై గేదెల రాజునాయుడు తన కుమారులు మణికంఠ, శ్రీనివాస్‌లతో వెళ్తుండగా ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజునాయుడు అక్కడికక్కడే మృతి చెందగా బైక్‌పై ఉన్న అతని ఇద్దరు కుమారులు గాయాలతో బయటపడ్డారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

ఇసుక లారీ సీజ్

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని తాడిపూడి ఓపెన్ ర్యాంపు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని మంగళవారం సీజ్ చేశామని ఇన్‌ఛార్జి తహశీల్దార్ మోహనభారతి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆర్‌డిఒ ఆదేశాల మేరకు ర్యాంపు నిర్వహిస్తున్న ఏజెన్సీకి నోటీసులు జారీ చేశామన్నారు. జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు ఓపెన్ ఇసుక ర్యాంపుల్లో ఎటువంటి ఇసుక లావాదేవీలు నిర్వహించరాదన్నారు. ఎవరైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓపెన్ ఇసుక ర్యాంపులుగా ఉన్న తాడిపూడి-1, వేగేశ్వరపురం-1 ర్యాంపులను ఇద్దరు విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, టాస్క్ ఫోర్స్ అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు.

ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని కరగపాడు, బుచ్చియ్యపాలెం గ్రామాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించి సారా తయారు చేస్తున్న, సారాను విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని ఎక్సైజ్ సిఐ బి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. కరగపాడులో సారా తయారు చేస్తున్న బుర్రి వెంకటరమణను అరెస్టు చేసి, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. బుచియ్యపాలెంలో సారా అమ్మకాలు జరుపుతున్న చిక్కాల రామకృష్ణను అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులపాక, గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - ఆలమూరు

అగ్నిప్రమాదంలో పశువులపాక, గడ్డివామి దగ్ధమైన ఘటన మంగళవారం మండలంలోని పెనికేరు పోలాల్లో చోటుచేసుకుంది. గోపు శ్రీనువాస్ అనే రైతుకు చెందిన పశువులపాకతో పాటుగా తన పశువుల గ్రాసంగా వేసిన భారీ గడ్డివామి ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. అయితే ప్రమాద సమయంలో పాకలో ఐదు గేదెలు ఉండగా మూడు గేదెలు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డాయి. అయితే రెండు గేదెలకు మాత్రం మంటలనుంచి తప్పించుకోలేక తీవ్ర గాయాల పాలయ్యాయని రైతు ఆవేదన చెందారు. గాయపడిన గేదెలకు పెనికేరు పశు వైద్యులు భానుప్రసాద్ వైద్య సేవలు అందించారు. సుమారు రూ.లక్ష పైన ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

దగ్ధమైన పశువుల పాక

విత్తనాల షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

నిడదవోలు మండలంలోని విత్తనాల షాపుల్లో కొవ్వూరు ఎడిఎ పి.చంద్రశేఖర్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో సరిగా పరిశీలించుకోవాలని రైతులకు సూచించారు. కేళీలు ఉన్నా, లేదా మొలక శాతం 80 శాతం కంటే తక్కువగా ఉన్నా వెంటనే తెలియజేయాలన్నారు. బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నిడదవోలులోని డిసిఎంఎస్, సత్యనారాయణ రైస్ అండ్ జనరల్ స్టోర్స్, శ్రీ భాను చైతన్య సీడ్స్‌లోని విత్తనాలు నిల్వలను పరిశీలించారు. ఎంటియు-1318, పిఎల్ఎ-1100, ఎంటియు-1064, ఎంటియు-1061, స్వర్ణ, సంపద స్వర్ణ వంటి రకాల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలో 419 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటివరకు 1,175 క్వింటాళ్ల విత్తనాలను రైతులు కొనుగోలు చేశారన్నారు. విత్తనాల నాణ్యతపై అనుమానాలుంటే నిడదవోలులోని ఇంటిగ్రేటెడ్ వ్యవసాయ ల్యాబ్‌లో ఉచితంగా పరీక్ష చేయించుకోవచ్చని రైతులకు సూచించారు. నాలుగు రకాల విత్తనాల శ్యాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారు.

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

120 మందికి కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి -దేవరపల్లి

ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 120 మందికి కళ్ల జోళ్లను మంగళవారం పంపిణీ చేశారు. దుద్దుకూరు షాలోమ్ టెంపుల్ ఆవరణలో ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జివివి.ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల కళ్లను కంటికి రెప్పలా కాపాడేందుకు పల్లె పల్లెనా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్న ఆమెన్ ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇవాంజలిన్ అశోక్ మాట్లాడుతూ వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సహకారంతో గతవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. సుమారు ఐదు వందల మంది హాజరయ్యారన్నారు. వారిలో 20 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించామన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకొని దుద్దుకూరుతో పాటు పలు ప్రాంతాల్లో త్వరలో దోమతెరలను పంపిణీ చేస్తామన్నారు. దుద్దుకూరు సొసైటీ మాజీ అధ్యక్షులు కాంద్రు రామకృష్ణ మాట్లాడుతూ ఆమెన్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. ట్రస్టు సభ్యులను పంచాయతీ కార్యనిర్వాహణ అధికారి బి.ఎస్.రామచంద్రరావు అభినందించారు. ఈ కార్యక్రమాన్ని షాలోమ్ టెంపుల్ నిర్వాహకులు కొడవటి బుజ్జిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కళ్ల జోళ్లను పంపిణీ చేస్తున్న ప్రసాద్ తదితరులు

దిలీప్‌కుమార్‌ను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

నిబద్ధత గల అధికారి దిలీప్‌కుమార్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నిబద్ధత గత అధికారి దిలీప్‌కుమార్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డు గ్రహీత, రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్‌ను ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు సోమవారం ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. విద్యారంగంలో దిలీప్‌కుమార్ చేస్తున్న ఉత్తమ సేవలకు అవార్డు లభించిందన్నారు. గజమాల, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అవార్డు గ్రహీత దిలీప్‌కుమార్ మాట్లాడుతూ, ఈ అవార్డు తన బాధ్యతలను మరింత పెంచిందన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ వారికి, అలాగే దళిత గిరిజన, బిసి, మైనార్టీ సంఘాల వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంఘాల ప్రతినిధులు తాళ్లూరి బాబూరాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, దారా ఏసురత్నం, ఎం.కృపావరం, సిద్ధ గిరి, కుంచె దానవాయిబాబు, జంగం సుబ్బారావు, ఎ.కుమార్‌బాబు, దారా సుందర్రావు, మిట్టపల్లి సుధీర్, రాయి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విలేకర్ల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - నిడదవోలు

స్థానిక రిపోర్టర్ మణికంఠ తల్లి రామలక్ష్మి జయంతి సందర్భంగా నిడదవోలు విలేకరుల ఆధ్వర్యంలో ఓవర్ బ్రిడ్జి డౌన్ వద్ద ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రిపోర్టర్ మణికంఠ మాట్లాడుతూ నాలుగేళ్లుగా తన తల్లి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని తెలిపారు. సుమారు 2000 మందికి మజ్జిగ పంపిణీ చేశామన్నారు. అనంతరం పట్టణ ఎస్ఐ జగన్మోహన్ చేతుల మీదుగా రిక్షా కార్మికులకు నిత్యావసర సరుకులు, పేదలకు దుప్పట్లను అందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు వెంకటరమణ, భాస్కర్ల రాజా రామ్మోహన్‌రాయ్, ఎస్.రాజకుమార్, విలేకర్లు పాల్గొన్నారు.

సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - కోరుకొండ

మండలంలోని ప్రతి గ్రామంలో ముఖ్యమైన కూడళ్లలో తప్పనిసరిగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ కూన నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో చాలా కెమెరాలు పని చేయడం లేదన్నారు. ఇలాంటి వల్ల ఉపయోగం లేదన్నారు. ఎవరైనా ఇంటిని విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీస్ స్టేషన్లో సమాచారం ఇస్తే నిఘా పెడతామని తెలిపారు. సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి - కొవ్వూరు

నియోజకవర్గంలో వివిధ రకాల ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న ఎనిమిది మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిన రూ.10.51 లక్షల చెక్కులను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం అందజేశారు. పట్టణంలో టిడిపి కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు వీటిని అందజేశారు. చిడిపికి చెందిన రోజారాణి రూ.35వేలు, పై పంగిడికి చెందిన కొయ్య సందీప్ రూ.4,52,296, ఎస్.ముప్పవరం గ్రామానికి చెందిన రామకృష్ణకు రూ.50వేలు, నల్లూరి వీర వెంకట బాలరాజుకు రూ.75,916, మల్లవరం గ్రామానికి చెందిన పిట్ల ప్రీతి సత్యవినుప్రభకు రూ.1,34,132, మలకపల్లికి చెందిన కుంటముక్కల అనిల్ కుమార్‌కు రూ.2,20,019, తిరుగుడుమెట్టకి చెందిన మదం రామకృష్ణకు రూ.39,319, పోచవరం గ్రామానికి చెందిన గుండుమొగలు మణికంఠకు రూ.44,629 విలువ చేసే చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో టుమెన్ కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులను అందిస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు

రేషన్ పంపిణీపై ఆరా తీస్తున్న జెసి చిన్నరాముడు

17, 286 మందికి రేషన్ డోర్ డెలివరీ

ప్రజాశక్తి - కొవ్వూరు

జిల్లా వ్యాప్తంగా 19 మండలాల పరిధిలో 65,863 మంది 65 ఏళ్ల నిండిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేసినట్లు జెసి ఎస్.చిన్న రాముడు తెలిపారు. కొవ్వూరులో రేషన్ సరుకులు డోర్ డెలివరీని ఆయన పరిశీలించారు. 65 ఏళ్ల నిండిన లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి ప్రభుత్వం నిర్ణయించిన ఆదేశాలు మేరకు సచివాలయ సిబ్బంది పర్య వేక్షణ చెయ్యడం ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రేషన్ డీలర్లు ఆధ్వర్యంలో ఇంటి వద్దకు వెళ్ళి రేషన్ సరుకులు పంపిణీ చేస్తారన్నారు. ఇకపై ప్రతి నెలా 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ నిత్యావసర సరు కులు పంపిణీ చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రానున్న రెండు మూడు రోజులలో పూర్తి స్థాయిలో పంపిణి చేస్తామని వెల్లడించారు.

వికలాంగులకు రేషన్ పంపిణీ చేసిన జెసి

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని తెలికిచర్లలో వికలాంగులకు ఇంటి వద్దనే జెసి చిన్నిరాముడు రేషన్ సరుకులను అందించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో మాట్లాడారు. నూతన రేషన్ పంపిణీలో మార్పులను లబ్ధిదారులకు వివరించారు. ప్రతి నెలా 5 వ తేదీ లోపు బియ్యం ఇతర సరుకులు వృద్ధులకు, వికలాంగులకు సిబ్బంది నేరుగా ఇంటికి తెచ్చి ఇస్తారన్నారు. ఆయన వెంట తహశీల్దార్, సివిల్ సప్లయిస్ డిటి, విఆర్ఒ తదితరులున్నారు.

నేడు వైసిపి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం

ప్రజాశక్తి- కొవ్వూరు

వైసిపి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం వాటర్ ట్యాంక్ జంక్షన్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తలారి వెంకట్రావు తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల పేరుతో జనాన్ని ఎలా మోసం చేసిందనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

11, 16, 17తేదీల్లో యోగా కార్యక్రమాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర-2025లో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11, 16, 17 తేదీల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అన్ని విభాగాల హెచ్ఒడిలతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. యోగాంధ్రలో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ఈనెల 11న ఛాంబర్ ఆఫ్ కామర్స్, సచివాలయ అడ్మిన్లు, ఎమినిటీ సెక్రటరీలతో, 16న ఎడ్యుకేషన్, వెల్ఫేర్, ప్లానింగ్, విఆర్ఒ, మహిళా పోలీస్, హెల్త్ సెక్రటరీలతో, 17న సచివాలయం శానిటేషన్ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులతో యోగాను నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులు సమర్థవంతంగా సేవలందించేందుకుగాను నిరంతర అభ్యసన తప్పనిసరి అని కమిషనర్ అన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం కర్మయోగి భారత్ ద్వారా అందించే ఆన్‌లైన్ కోర్సులను పూర్తిచేసి సర్టిఫికెట్లు పొందాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ సమీక్షలో అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఇ ఎంసిహెచ్.కోటేశ్వరరావు, మేనేజర్ ఎమ్‌డి అబ్దుల్ మాలిక్, ఎంహెచ్ఒ వినూత్న, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

28 ఇసుక ర్యాంపులు మూసివేత

18 ర్యాంపుల్లోనే ఇసుక తవ్వకాలు
29 చోట్ల స్టాక్ పాయింట్లు ఏర్పాటు

ప్రజాశక్తి -కొవ్వూరు

పర్యావరణ, అటవీశాఖ నిబంధనల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 28 ర్యాంపులను మూసివేశారు. వీటిలో 15 ఓపెన్ ర్యాంపులు, 10 సెమీ మెకానైజ్డ్, పట్టా భూముల్లో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపులను జూన్ ఒకటో తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు మూసి ఉన్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. పర్యావరణ శాఖ నిబంధనలను వర్తించని 18 డీ సిల్టేషన్ ర్యాంపులు మాత్రమే నడవనున్నాయి. వర్షాకాల అవసరాలు దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా 29 చోట్ల స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. 28 ర్యాంపులు మూత పడడంతో మళ్లీ ఇసుకకు డిమాండ్ పెరగనుంది. మరోవైపు నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో మళ్లీ ఇసుక కష్టాలు మొదలయ్యే అవకాశం ఉంది.

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ

ప్రజాశక్తి- పెరవలి

మండలంలోని పెరవలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా జిల్లా పరిశీలకులు డి.అచ్యుతకుమార్, మండల విద్యాశాఖ అధికారి-2 షేక్ సూర్జహాన్ పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలన్నారు. భోజన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన పి.విజయలక్ష్మి వంటలపై అవగాహన కల్పించారు. అనంతరం భోజన కార్మికులకు వంటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎల్.నాగేశ్వరి, ఉపాధ్యాయులు కె.నాగేశ్వరరావు, జె.బాలకృష్ణకుమార్ పాల్గొన్నారు.

5న శేషారావు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పెరవలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బూరుగుపల్లి శేషారావు ఈ నెల 5న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తాడేపల్లిలోని స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో ఆయన ప్రమాణ స్వీకారం చేస్తారు. అనంతరం బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, మండలం నుంచి పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు తరలిరావాలని టిడిపి మండల అధ్యక్షుడు అతికాల వెంకట రామకృష్ణమ్మ, రాజమండ్రి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బొడ్డు రామాంజనేయులు పిలుపునిచ్చారు.

వైసిపి మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షునిగా బాలరాజు

ప్రజాశక్తి - నిడదవోలు

వైసిపి మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షునిగా నిడదవోలు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎలగాడ బాలరాజును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా వేటికీ లోనుకాకుండా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్న వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని బాలరాజు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బాలరాజు ఎంపిక పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

కుట్టుతో పేద మహిళలకు ఆర్థిక భరోసా

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

ఆర్థికంగా వెనకబడిన పేదింటి మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం ద్వారా ఆర్థిక భరోసా అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళవారం నిడదవోలు మండల పరిషత్ కార్యాలయంలో బిసి ఫైనాన్స్ కార్పొరేషన్, ఇడబ్ల్యుఎస్ సహకారంతో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కుట్టు శిక్షణ కేంద్రంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 90 రోజులపాటు అందించే కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 496 మందికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తే, నిడదవోలులో మాత్రం తాము 540 మందికి అవకాశం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జడ్‌పిటిసి సభ్యులు కొయ్యే సూర్యారావు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్ర ప్రారంభోత్సవంలో మంత్రి దుర్గేష్

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కడియం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర తతీయ కౌన్సిల్ సమావేశం ఈ నెల 5న విజయవాడ ఎస్ కన్వెన్షన్ హాల్లో జరుగుతుందని, దీన్ని విజయవంతం చేయాలని సంఘ జిల్లా కార్యదర్శి సిహెచ్ఎస్.విల్సన్‌పాల్ కోరారు. కడియం పిహెచ్‌సి పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవణ్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారని తెలిపారు. ఐఆర్, పిఆర్‌సి, డిఎ బకాయిలు వంటి సమస్యలను సిఎం దృష్టికి నాయకులు తీసుకెళ్తారాన్నరు. రాష్ట్ర వ్యాప్తంగా పదివేల మందికిపైగా ఉద్యోగులు ఈ సమావేశానికి హాజరు కానున్నారని తెలిపారు. ఈ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యే ఉద్యోగులకు ఒకరోజు ప్రత్యేక సెలవును కూడా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వివిఎస్.రాజు, పి.మురళీకృష్ణ, కె.శ్రీనివాసరెడ్డి, వై.శాంతిరాజు, కెవిఎన్.మూర్తి, టి.మణిశ్రీ, వి.ఉమ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం:

మహాత్మా పూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాల సాధనకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ బిసి యూత్ ప్రెసిడెంట్ మారిశెట్టి సూరిబాబు మంగళవారం తెలిపారు. బిసి చైతన్య వేదిక, ఆంధ్రప్రదేశ్ బిసి యూత్ ప్రెసిడెంట్‌గా తాడిపర్రుకు చెందిన తనను నియమించినట్లు సూరిబాబు తెలిపారు. బిసిలకు, సామాన్య ప్రజలకు ఏమైనా అన్యాయం జరిగితే అధిక శాతం మంది నాయకులు నిందితుల వైపు నిలబడుతున్నారన్నారు. తాను బలహీనుల వైపు నిలబడి పోరాడేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. తాడిపర్రు గౌడ సంఘం నాయకులు, సభ్యులు సూరిబాబును అభినందించారు. ఈ సందర్భంగా తనను ఎంపిక చేసిన జాతీయ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు అన్నం వెంకటేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

125 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 125 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన అకిరా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. 125 మంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారని వైద్యులు ఎ.రమేష్ తెలిపారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. 25 మందికి శస్త్ర చికిత్సలు అవసరమన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా తమ ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రికి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

BEFORE THE HON'BLE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
O.S.226/2024

Between:
Gubbala Naga Malleswara Rao ...Plaintiff
And:
Smt. Nanduri Kiranmai ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Smt. Nanduri Kiranmai,
D/o.Veerabhadrasarma,
D.No.11-3-8,
Sheshayyampeta, Aryapuram,
Rajahmahendravaram,
East Godavari,
Andhra Pradesh-533104.

Please take notice that the above suit was filed by the Plaintiff against you for recovery of money with costs and for such other relief/ reliefs and the same was stands posted to serve notice to you for your appearance on **20-06-2025.** As such you are get ready to appear either in person or through an Advocate on **20-06-2025** at **10.30 A.M.,** before Court at Visakhapatnam, failing which you will be set ex-parte and the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)
G. ESWARA PRASAD,
Advocate
Visakhapapatnam-08.
Cell: 9849793466.

పేపరు ప్రకటన

మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ సివిలు జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు
I.A. No. 553 of 2019 in
O.S. No. 209 of 2019

Between:
చింతా బాపిరెడ్డి -పిటీషనర్
AND
1. తుమ్మపూడి మల్లేశ్వరి
2. ఒజ్జి లక్ష్మికుమారి -రెస్పాండెంట్లు

To:
1వ రెస్పాండెంటు: తుమ్మపూడి మల్లేశ్వరి,
R-1: తుమ్మపూడి మల్లేశ్వరి

R-1: తుమ్మపూడి మల్లేశ్వరి, W/o. సాంబశివరావు, D/o. రాజమండ్రి వీరాస్వామి, వయస్సు 56 సం॥లు, హిందువు, అటెండర్ in A/O ఆఫీస్, A.P.S.P.D.C.L. Ltd., చిట్టినగర్ సెక్షన్, 1-టౌన్, డో.నెం. 5-6-59/106/బి. రైతు బజార్ ఎదురుగా, రాజేష్‌రావు వీధి, ఫ్రేజర్ పేట, విజయవాడ - 520001, కృష్ణా జిల్లా, నివాసం: డో.నెం. 1-184, ఉండవల్లి, తాడేపల్లిగూడెం మండలం, గుంటూరు జిల్లా.

పై నంబరు పిటిషన్ ది. 16-06-2025వ తేదీన పై కోర్టు నందు వాయిదా అయివున్నది. పై పిటిషన్ నందు మీకు ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టున **ది. 16-06-2025వ తేదీన ఉదయం 10.30 గంటల** నుండి మీరు స్వయంగా గాని, మీ న్యాయవాదితో గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరు అయి మీ వాదనను తెలుపుకొనవలెను. లేని యెడల మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్పు చెబుదురు.

(శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)

పెద్దాపురం
ది.02-05-2025
M.K.మొహియుద్దీన్
అడ్వకేట్, పెద్దాపురం

పేపరు ప్రకటన

మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ సివిలు జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు
O.S. No. 209 of 2019

Between:
చింతా బాపిరెడ్డి -వాది
AND
1. తుమ్మపూడి మల్లేశ్వరి
2. ఒజ్జి లక్ష్మికుమారి -ప్రతివాదులు

To:
1వ ప్రతివాది: తుమ్మపూడి మల్లేశ్వరి,
D-1: తుమ్మపూడి మల్లేశ్వరి, W/o. సాంబశివరావు, D/o. రాజమండ్రి వీరాస్వామి, వయస్సు 56 సం॥లు, హిందువు, అటెండర్ in A/O ఆఫీస్, A.P.S.P.D.C.L. Ltd., చిట్టినగర్ సెక్షన్, 1-టౌన్, డో.నెం. 5-6-59/106/బి. రైతు బజార్ ఎదురుగా, రాజేష్‌రావు వీధి, ఫ్రేజర్ పేట, విజయవాడ - 520001, కృష్ణా జిల్లా, నివాసం: డో.నెం. 1-184, ఉండవల్లి, తాడేపల్లిగూడెం మండలం, గుంటూరు జిల్లా.

పై నంబరు దావా ది. 16-06-2025వ తేదీన పై కోర్టు నందు వాయిదా అయివున్నది. పై దావా నందు మీకు ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టున **ది. 16-06-2025వ తేదీన ఉదయం 10.30 గంటల** నుండి మీరు స్వయంగా గాని, మీ న్యాయవాదితో గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరు అయి మీ వాదనను తెలుపుకొనవలెను. లేని యెడల మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్పు చెబుదురు.

(శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)

పెద్దాపురం
ది.02-05-2025
M.K.మొహియుద్దీన్
అడ్వకేట్, పెద్దాపురం